సింహాద్రి అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

విశాలాంధ్ర - గోపాలపట్నం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి వారిని అనువంశిక ధర్మకర్త పి అశోక్ గజపతిరాజు దంపతులు, వెస్ట్ బెంగాల్ మినిస్టర్ బేచారమ్ మన్న దంపతులు, సోమిరెడ్డి చంద్రమోహన్ దంపతులు, చంద్ర శేఖర్ రెడ్డి, గంటా శ్రీనివాసరావు, రఘురామ కృష్ణంరాజు, పి. గనబాబు దంపతులు, విష్ణుకుమార్ రాజు తదతరులు దర్శించుకున్నారు. సహాయ కార్యనిర్వహణాధికారి ఎస్ ఆనంద్ కుమార్ ఘన స్వాగతం పలికారు. తొలుత వీరు కప్ప స్తంభం ఆలింగనం చేసుకుని, తమ తమ గోత్ర నామాలతో స్వామివారికి సంకల్పం చేయించారు. దర్శనానంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు ఏ.ఈ. ఓ అందజేశారు.

జూన్ 4న ఫలితాలు జగన్ షాక్ ఇస్తాయి.. ఏపీ సీఎస్‌ను మార్చాలి

మీడియా సమావేశంలో గంటా, సోమిరెడ్డి, రఘురామ కృష్ణంరాజు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : జూన్ 4న ఫలితాలు జగన్‌కు షాక్ నిస్తాయని మాజీ మంత్రి భీమిలి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు, మాజీ మంత్రి, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎంపీ, ఉండి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి రఘురామ కృష్ణంరాజులు బుధవారం ఎం.వి.పి.కాలనీలోని గంటా నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముందుగా మాజీమంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ జూన్ 4 న ఫలితాలు చూసి అందరూ షాక్ అవుతారన్న జగన్మోహన్ రెడ్డి మాటలు నిజమవుతాయి. అయితే కూటమికి అనుకూలంగా రాబోతున్న ఈ ఫలితాలు జగన్ ను ఖచ్చితంగా షాక్ కు గురి చేస్తాయన్నారు. పోలింగ్ సరళి పరిశీలిస్తే అంతా ఏకపక్షంగా జరిగినట్టు తెలిసిపోతోంది. హైదరాబాద్, బెంగళూరు నుంచి ఓటర్ల తాకిడి సంక్రాంతి రాకపోకలను తలపించిందన్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయి సర్వే సంస్థల ఫలితాలన్నీ ఏకపక్షంగానే వస్తున్నాయని, మాచర్ల పోలింగ్ స్టేషన్ లో ఎమ్మెల్యే పిన్నెల్లి ఈ.వి.ఎం.ను పగలగొట్టడం, పోలింగ్ అనంతరం తాడిపత్రి, పల్నాడు తదితర ప్రాంతాల్లో సాగిస్తున్న దాడులు వైసీపీ నేతల్లో నెలకొన్న తీవ్ర నిరాశ నిస్పృహలకు నిదర్శనం అన్నారు. కూటమి అభ్యర్థులు ఓటు వేయడానికి వెళ్లినప్పుడు పోలింగ్ స్టేషన్ లో ఓటర్లు స్వచ్ఛందంగా ఓటు వేయమని క్యూ లైన్ తో సంబంధం లేకుండా వెళ్లడానికి అవకాశమిచ్చారు. అదే వైసీపీ అభ్యర్థులను క్యూలో రావాలని అడ్డుకున్నారు. తెనాలిలో సామాన్య ఓటరు ఎమ్మెల్యే చెంప చెళ్లుమనిపించారన్నారు. ఓటమి అంచుల్లో ఉన్నప్పటికీ జూన్ 9 న విశాఖలో ప్రమాణ స్వీకారం, స్టేడియం, స్టార్ హోటల్ రూమ్ లు బుక్ చేశామంటూ ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్తిబాబు చేసిన స్టేట్మెంట్ చూసి జనం నవ్వుకుంటున్నారని, జూన్ 9 న ఆంధ్రప్రదేశ్ మూడవ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం, ఎమ్మెల్యేలుగా ఇక్కడున్న నేను, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, రఘురామ కృష్ణంరాజు, విష్ణుకుమార్ రాజు అసెంబ్లీలో అడుగు పెట్టడం ఖాయం అన్నారు. మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుస్తున్నామని ఐ ప్యాక్ వాళ్లు సీఎం కు చెప్పాలి. విచిత్రంగా ఆ విషయం సీఎం ఐ ప్యాక్ వాళ్లకు చెప్పడం వెటకారంగా అనిపిస్తోందన్నారు. సినిమాల్లో విలన్ అరాచకాలకు క్లైమాక్స్ లో శుభం కార్డు పడుతుంది. జగన్మోహన్ రెడ్డి రాజకీయ జీవితానికి కూడా ఈ ఎన్నికలతో శుభం కార్డు పడబోతోందన్నారు. జగన్మోహన్ రెడ్డి హయాంలో చట్ట సభలకు గౌరవం లేదు. వ్యవసాయం, నీటి పారుదల వంటి మంత్రిత్వ శాఖలన్నీ కుప్పకూలి పోయాయన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన రెడ్డి లా కల్తీ మద్యం, నకిలీ పత్రాలు, అక్రమ మైనింగ్, వనరుల దోపిడీ వంటి అనైతిక పనులకు నేను దూరం అన్నారు. రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ ఈ ఎన్నికల తర్వాత రాజకీయ చిత్రపటంలో నుంచి జగన్మోహన్ రెడ్డి కనుమరుగు కాబోతున్నారని,విదేశాలకు వెళ్లిన ప్రతిసారీ రాష్ట్రంలో హింస చెలరేగేట్టు జగన్మోహన్ రెడ్డి ప్లాన్ చేస్తారని, ఈసారీ ఏదో స్కెచ్ వేసే ఉంటారన్నారు. జూన్ 4 తర్వాత జగన్మోహన్ రెడ్డికి లండన్ లో జిమ్ చేస్తుంటే కాలు బెణుకు తుందన్నారు. ఆంధ్రకు రాకుండా బెంగళూరు లేదా మళ్లీ విదేశాలకు వెళ్లిపోయే ఛాన్స్ ఉందన్నారు. ఎన్నికల్లో ఎత్తి పోయామని ఆల్రెడీ వై.వి.సుబ్బారెడ్డి తన చుట్టూ ఉన్న వాళ్లకి చెప్పేశాడని, జగన్ బాధ తట్టుకోలేక మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తుందని చెబుతున్నాడన్నారు. ఎలాగో స్టేడియం, రూమ్ లు బుక్ చేసుకుంటున్నారు కాబట్టి వాళ్ల సంతృప్తి కోసం డమ్మీ ప్రమాణ స్వీకారం చేసుకుంటారేమో! నేను గెలిచాక చట్టబద్ధంగా జగన్మోహన్ రెడ్డికి రిటర్న్ గిఫ్ట్ గ్యారంటీగా ఉంటుందన్నారు. సీఎం జగన్ అధికారులను భ్రమల్లో ఉంచి బిల్లులు విడుదల చేయించుకోవడానికే 151 కంటే ఎక్కువ సీట్లతో అధికారంలోకి వస్తున్నామని పదే పదే చెప్పుకుంటున్నారు. ఈ 15 రోజుల్లో అందిన కాడికి దోచుకుంటున్నారు. చీఫ్ సెక్రటరీ జవహర్ రెడ్డిని పక్కన పెడితేనే కౌంటింగ్ సజావుగా జరుగుతుంది. తక్షణమే చీఫ్ సెక్రటరీని మార్చాలన్నది మా డిమాండ్ అన్నారు. ఉద్యోగులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన చరిత్ర లేదన్నారు. వైసీపీ ఏం చేయాలని అనుకుంటుందో దాన్ని టిడిపికి ఆపాదిస్తూ ముందుగా సాక్షి పేపర్ లో రాస్తారు. అధికార పార్టీ ప్లాన్ తెలుసుకోవాలంటే నీలి పత్రికను చదివితే తెలిసిపోతుందన్నారు. పారిశ్రామికవేత్తలుగా, లబ్దిదారులుగా వేషాలు వేసే ప్రతినిధులున్న ఐ ప్యాక్ టీమ్ ఒక డ్రామా కంపెనీ అన్నారు. ఈ సమావేశంలో నార్త్ అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి విష్ణుకుమార్ రాజు, భీమిలి టిడిపి ఇంచార్జీ కోరాడ రాజబాబు పాల్గొన్నారు.

రద్దీ వేళ రైళ్లు రద్దు పై ప్రయాణికుల ఆగ్రహం...

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : నిర్వహణ పనులు (ట్రాఫిక్ బ్లాక్) పేరుతో ఎక్కువ సంఖ్యలో రైళ్లను తరచూ రద్దు చేస్తుండడంతో రైల్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అత్యాధునిక వ్యవస్థ కలిగిన రైల్వే శాఖ ఏడాదిగా నిర్వహణ, ఆధునీకీకరణ పనులు పేరుతో డిమాండ్ ఉన్న రైళ్లు రద్దు చేస్తుందని, సీజన్, ప్రయాణికుల రద్దీని పరిగణలోకి తీసుకోకుండా రైళ్ల రద్దు, దారిమళ్లింపులు చేస్తుందని ధ్వజమెత్తారు. రైల్వే ప్రయాణికుల హక్కులను కాలరాసే విధంగా రైల్వే అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఏ పనికైనా రైల్వే సిటిజన్ ఛార్టర్ ప్రకారం నిర్థేశిత గడువు ఉంటుందని, అయితే దానిని త్రోసిపుచ్చి ఏడాది పొడవునా రైల్వే ప్రయాణికుల సహనాన్ని పరీక్షిస్తున్నారని పలువురు ప్రయాణికులు మండిపడ్డారు. విజయవాడ నుంచి విశాఖపట్నం మధ్య నడిచే సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లో ప్రతి రోజూ పెద్దసంఖ్యలో ఉద్యోగులు, వ్యాపారులు ఏలూరు, నిడదవోలు, తాడేపల్లిగూడెం, రాజమహేంద్రవరం, అన్నవరం, విశాఖపట్నం వరకు వెళుతుంటారు. ఈ రైలును గత కొంత కాలంగా నిర్వహణ పనుల పేరుతో రద్దు చేస్తుండడం విచారకరమన్నారు. ఇది ద్వారకా తిరుమల చిన వెంకన్న దర్శనానికి వెళ్లే భక్తులకు సౌకర్యంగా ఉండేదన్నారు. గుంటూరు, రాయగడ మధ్య నడిచే రైలును కూడా ఇలాగే ఆపేశారన్నారు. హౌరా మార్గంలో రైళ్లు ఎప్పుడూ రద్దీగా నడుస్తాయని, రిజర్వేషన్ కూడా సీజన్, అన్ సీజన్‌తో సంబంధం లేకుండా 4 నెలల ముందే బుక్ చేసుకుంటారని విజయవాడ, బిట్రగుంట మధ్య నడిచే రైళ్లదీ ఇదే పరిస్థితన్నారు. సాధారణ రోజుల్లో విజయవాడ నుంచి లక్ష మంది వరకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుండగా వేసవి సెలవుల్లో ఇది రెట్టింపవుతుందని, ఈ సమయంలో సర్వీసులు ఆపేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. అదే విధంగా దక్షిణ మధ్య, తూర్పు మధ్య రైల్వే డివిజన్లలోని బ్రాంచి లైన్లలో కూడా ప్రయాణికులు నరకయాతన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మార్గాలు ఉదయం, సాయంత్రం వేళల్లో ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థుల రాకపోకలకు ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. నిత్యం రద్దీగా, ప్రయాణికులకు అనుకూలంగా ఉండే మచిలీపట్నం-విశాఖ ఎక్స్‌ప్రెస్ (17219), గుంటూరు-విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17239), గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ (17243), తిరుపతి-విశాఖ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ (22708), విశాఖ-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ (17220), విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17240), రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ (17244), విశాఖ-తిరుపతి డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ (22707), విశాఖ-గుంటూరు డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22701), గుంటూరు-విశాఖ డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22702), రాజమండ్రి-విశాఖపట్నం (07466), విశాఖ-రాజమండ్రి (07467) రైళ్లను రైల్వే శాఖ తాజాగా రద్దు చేయడం సమంజసం కాదని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆర్‌బీకేలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు

విశాలాంధ్ర - పద్మనాభం : మండలంలోని పలు ఆర్బీకేలను ఏపి మార్కుఫెడ్, ఎమ్‌డి శ్రీ శేఖర్ బాబు భీమునిపట్నం డివిజ న్‌లో గల బోని, మద్ది రైతు భరోశ కేంద్రా లను పరిశీయించారు. అనంతరం విచ్చేసి రైతులతో రైతులతో మాట్లాడుతూ విత్తనాలు మరియు ఎరువులు సకాలంలో అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. శేఖర్ బాబు గారు రైతులతో మాట్లాడుతూ ఎరువులు నిల్వ చేయుటకు స్టోరేజ్ గొడౌన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. రైతులు ఇబ్బంది పడకుండా మొక్కజొన్న మరియు రాగులు.పంట పక్వానికి వచ్చే 15 రోజుల ముందే కొనుగోలు కేంద్రాన్ని ముందస్తుగా ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం లో విశాఖపట్నం జిల్లా వ్యవసాయధికారి కె.అప్పలస్వామి, భీమిలి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు బి.విజయప్రసాద్, డిఎం అప్ మార్కుఫెడ్ కి.రమేష్, ఏఈఓ శ్రీనివాస్, విఏఓ రమ్య రైతులు పాల్గున్నారు.

ఫుట్ పాత్‌పై ఆక్రమణలు...

విశాలాంధ్ర - పీఎం పాలెం : మధురవాడలో ఇప్పటికే ట్రాఫిక్ కష్టాలు ప్రజల్ని పట్టిపీడిస్తుంటే మరోపక్క ఫుట్పాత్లను సైతం వదలకుండా కొమ్మాది జంక్షన్లో ఒక వ్యక్తి బండి ఏర్పాటు చేయడంపై నడక దారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీలో అధికారులకు చేతులు తడిపి ఫుట్పాత్రుల పైన బడ్డీలు అక్రమంగా పెట్టడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని ఆ ప్రాంతవాసులు తెలిపారు. నడక దారులపై షాపులు నిర్మాణం చేపడుతుంటే అధికారులు పట్టించుకోక పోవడంపై తీవ్ర అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కొమ్మాది జంక్షన్ సిగ్నల్ పాయింట్ వద్ద ఏర్పాటుచేసిన ఈ బడ్డి పై ట్రాఫిక్ పోలీసులు కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ ఏర్పాటు చేయడంపై స్థానికులు నడక దారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నూతన వస్త్రాల షోరూమ్‌ను ప్రారంభించిన భీమిలి జనసేన ఇన్చార్జ్ డాక్టర్ సందీప్

విశాలాంధ్ర - ఆనందపురం : అనంతపురం జంక్షన్ మహాత్మా గాంధీ పూల మార్కెట్ వద్ద లోకల్ బాయ్ న్యూ ఫ్రెండ్స్ బట్టల షో రూమ్ ను బుధవారం భీమిలి నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ డాక్టర్ సందీప్ పంచకర్ల ప్రారంభించారు ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ యువత ప్రతి ఒక్కరు స్వతహాగా అభివృద్ధి చెంది నలుగురికి ఉపాధి కల్పించే విధంగా ఆదర్శంగా నిలవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొప్రైటర్ పండు, మండల ప్రెసిడెంట్ తమ్మిన అప్పలరాజు, జాన కృష్ణ, ప్రశాంత్ కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకమవుతున్న గుంటూరు

విశాలాంధ్ర - పెందుర్తి : పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన విశాఖ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుంటూరు వెంకట నరసింహారావు మరో సారి ప్రజలతో మమేకమవుతున్నారు. పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను కలిసి పెందుర్తి నియోజకవర్గం అభివృద్ధి గురించి చర్చిస్తున్నారు. బుధవారం సబ్బవరం మండలంలో సీనియర్ రాజకీయ నాయకుడు ముమ్మన కన్నయ్య తదితరులను కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలు గత పాలకులు నిర్లక్ష్యంపై చర్చించారు. కొత్త ప్రభుత్వంలో వాటిని సాధించే అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు లెండి కాలేజీ మేనేజింగ్ డైరెక్టర్ మధుసూదన్ రావు తో సమావేశమై పలు అంశాలు గురించి చర్చించారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం

విశాలాంధ్ర - పెందుర్తి : పెందుర్తి శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరంలో 39 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కథలు చదవడం, రాయడం, చెప్పడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం రిటైర్డ్ టీచర్ జానకిరామ్ సత్య హరిశ్చంద్రుని స్ఫూర్తిదాయక కథ చెప్పి నీతిని వివరించారు. విద్యార్థులకు మీకు నచ్చిన చిత్రం అనే అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతి థులుగా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ప్రెసిడెంట్ పథకం శెట్టి భూలోక రావు కార్యదర్శి ఆదారి రామకృష్ణ హాజరు కాగా కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారిని బి.సూర్యకళ నిర్వహించారు.

కాలదోషం పట్టిన చట్టాల ప్రక్షాళన అవసరం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : కాలదోషం పట్టిన చట్టాలు సమూలంగా మార్పు చేయాల్సిన అవసరం వుందని ,సత్వర న్యాయం అందించాలనే ఉద్దేశంతో ప్రక్షాళన జరిపి కొత్త చట్టాలను అమలు లోకి తీసుకువస్తున్నట్లుపిఐబి (ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో) అడిషనల్ డైరెక్టర్ జనరల్ రాజేంద్ర చౌదరి తెలిపారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా డిజిటల్, ఎలాక్ట్రానిక్ డివైజ్ లను సాక్ష్యంగా పరిగణించే విధానం అమల్లోకి తీసుకువచ్చారు అన్నారు.స్థానిక హోటల్లో కేంద్ర ప్రభుత్వ ఇన్ఫర్మేషన్ బ్రాడ్ కాస్టింగ్ విజయవాడకు చెందిన పీఐబీ ఏర్పాటు చేసిన 'వార్త ల్యాప్ ఆన్ త్రీ న్యూ క్రిమినల్ లాస్' అంశంపై జరిగిన వర్క్ షాప్ కు ఆయన అధ్యక్ష వహించి మాట్లాదారు. పిఐబి పథకాలు, ప్రచారం గురించి వివరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐజి, ఈ దామోదర్ మాట్లాడుతూ నమోదు.తప్పుడు కేసుల్లో అమాయకులకు శిక్ష పడకూడదని కొత్త ఎవిడెన్స్ ఏక్ట్ ను అమల్లోకి తెచ్చారన్నారు. పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేస్తే రశీదు ఇవ్వలేదు, న్యాయం జరుగుతుందా? అనే అభద్రత భావం ఉంటుందని తెలిపారు. కానీ నేడు ఆధునిక విజ్ఞానం అందుబాటులోకి వచ్చాక బాధితులు తమకు జరిగిన అన్యాయంపై సంఘటన స్థలం నుంచి స్మార్ట్ ఫోన్ ద్వారా ఆన్లైన్లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. పైగా ఆ ఫిర్యాదు రికార్డెడ్ గా ఉంటుందని స్పష్టం చేశారు. బాధితులకు సరైన న్యాయం జరగడం కోసం చట్టాలలో మార్పులు తేవడం జరుగుతుం దన్నారు. అలాగే నేరస్తులను విచారించడానికి పోలీసులకు జ్యుడీషియల్ కస్టడీ కాల పరిమితి పెంచనున్నారని తెలిపారు. పెరిగిన సాంకేతిక టెక్నాలజీని నేరాల నియంత్రణకు ఉపయోగించు కోవాలన్నారు. రోడ్డు ప్రమాదంలోని మరణాలను తగ్గించడానికి, గోల్డెన్ అవర్లో చేర్చితే మరణాలను నివారించవచ్చని తెలిపారు. హిట్ అండ్ రన్ కేసులో క్షతగాత్రులను వదిలేసి వెళ్ళిపోతే వారిపై కూడా చర్యలు తీసుకునేలా పరిశీలన ఉందన్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన ఈ చట్టాల ద్వారా బాధితులకు న్యాయవ్యవస్థపై మరింత నమ్మకం కలిగిస్తుందని తెలిపారు. ఈ చట్టాలతో పరిధితో సంబంధం లేకుండా సంఘటనా స్థలం నుంచే ఫిర్యాదు చేసి ఇ-ఎఫ్ఐఆర్ పొందవచ్చన్నారు. ప్రజలకు జవాబుదారీ తనంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ చట్టాలను తీసుకువచ్చిందని వివరించారు. చట్టంలో మరిన్ని మార్పులు తీసుకొస్తారన్నారు. దామోదర సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సీపీ నందిని మాట్లాడుతూ గతంలో ఇండియన్ పీనల్ కోడ్లో కొన్ని చట్టాలు ఉండేవని, తర్వాత వాటి సంఖ్యను పెంచుతూ అనేక చట్టాలను చేర్చారన్నారు. ఆర్గనైజింగ్ నేరాలు సమాజాన్ని ప్రభావితం చేస్తాయన్నారు. అంతేకాకుండా కోర్టులో సమర్పించే ఎవిడెన్స్ లో కొత్తగా ఎలక్ట్రానిక్ అల్ డిజిటల్ ఎవిడెన్స్ చేర్చారని తెలిపారు. ముఖ్యంగా పాత్రికేయులకు ఆధునిక చట్టాలపై అవగాహన ఉండాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ వై.ఉపేందర్, షఫీ పాల్గొన్నారు.

కౌంటింగ్‌లో ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలి

జిల్లా ఎన్నికల అధికారి డా.ఎ. మల్లికార్జున

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో వచ్చేనెల 4వ తేదీన నిర్వహించబోయే ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్ల విషయములో ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలని రిటర్నింగ్ అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. బుధ వారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.ఎ. మల్లికార్జున మాట్లాడుతూ రిటర్నింగ్ అధికారులు అత్యంత జాగరూకతతో వ్యవహరించాలని సూచించారు. కౌంటింగ్ ఏర్పాట్ల పై అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులతో సమావేశం ఏర్పాటు చేసి కౌంటింగ్ ఏర్పాట్లకు చేపడుతున్న చర్యలు గురించి వివరంగా తెలియజేయడం ద్వారా వారిలో ఉండే అపోహలు తోలగించాలని అన్నారు. కౌటింగ్ సెంటర్ల వద్ద సి సి కెమెరాల ఏర్పాటు, బారికేడ్ల ఏర్పాటు, కౌటింగ్ హాలులో టేబుళ్ల ఏర్పాటు, రాజకీయ పార్టీల ఏజెంట్లకు ఐడంటిటీ కార్డుల మంజూరు గురించి రిటర్నింగ్ అధికారులను అడగి తెలుసుకున్నారు. ఈ నెల 31వ తేది సాయంత్రం కల్లా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పబ్లిక్ కమ్యూనికేషన్ రూమ్ ఏర్పాటు, సెల్ ఫోన్ బద్రపరచు సెంటర్, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై రిటర్నింగ్ అధికారులకు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. కౌటింగ్ విధుల కొరకు సిబ్బంది మొదటి విడత రాండమైజేషన్ ఈ నెల 25వ తేదిన నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జి వి ఎమ్ సి కమిషనర్ సాయి కాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె మయూర్ అశోక్, జి వి ఎమ్ సి ఎడిసి కె.ఎస్. విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, రెవిన్యూ డివిజనల్ అధికారులు హుస్సేన్ సాహెబ్, కె భాస్కర్ రెడ్డి, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

జోన్ - 2 కార్యాలయ పునర్నిర్మాణ పనులు వేగవంతం చేయండి

జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయి కాంత్ వర్మ

విశాలాంధ్ర - పీఎం.పాలేం : జివిఎంసి జోన్-2 కార్యాలయ పునర్నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జివిఎంసి కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన జివిఎంసి పరిధిలోని మధురవాడ జోన్-2 కార్యాలయాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న కార్యాలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ పరిశీలనలో కమిషనర్ జోన్-2 కార్యాలయంలోని అన్ని విభాగాలను పరిశీలించి కార్యాలయం అంతా ఆకర్షణీయమైన ఆకృతలతో నిర్మాణం చేపట్టి ఆధునీకరణ మైన ఫర్నిచర్, విద్యుత్తు, కేబుల్ వైర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యాలయం పక్కన ఉన్న సౌకర్య కేంద్రం (సిటిజన్ సర్వీస్ సెంటర్) ను పరిశీలించి నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఐటి సెజ్ వద్ద ఆదిత్య అపార్టుమెంట్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ఉన్న ఐటి సెజ్ పార్కును సందర్శించి పార్కులోని పనులను, అలాగే సమీపంలో ఉన్న టెన్నిస్ కోర్టు పార్కు పనులను త్వరతగతిన పూర్తి చేయాలని పర్యవేక్షక ఇంజనీరు శాంసన్ రాజు, కార్యనిర్వాహక ఇంజనీరు శాంతి రాజ్ లను ఆదేశించారు. ఐటి సెజ్ రోడ్లపై ఉన్న అనధికార బడ్డీలను వెంటనే తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను కమిషనర్ ఆదేశించారు.ఈ పర్యటనలో ఏ.డి.హెచ్ సురేష్, ఏ.ఎం.హెచ్.ఓ కిషోర్, ఉప కార్యనిర్వహక ఇంజనీర్ వంశి, సహాయక ఇంజనీర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వీనుల విందుగా స్వాతినక్షత్ర హోమం

విశాలాంధ్ర - సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం సింహాద్రినాధుని దేవాలయంలో బుధవారం కార్యనిర్వహణాధికారి ఎస్ శ్రీనివాసమూర్తి ఆదేశాల మేరకు స్వాతి నక్షత్రం పురస్కరించుకుని శ్రీ నృసింహ హోమం పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ హోమంలో ప్రత్యక్ష , పరోక్ష 225 జంటలు పాల్గొన్నాయి. తొలుత చక్రపెరుమాళ్ స్వామి విశేష పూజలు నిర్వహించారు. అగ్నిమథనం, హోమగుండ ప్రదక్షిణం చేశారు. అనంతరం యజ్ఞభగ వానుడికి పూర్ణాహుతి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని అప్పన్న స్వామికి వేకువజామున పూజాదికాలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తులను యాగశాలలో అధిష్టింపచేసి విష్వక్సేన, పుణ్యాహవచనం పూజలు జరిపారు. అనంతరం నృసింహ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులకు యజ్ఞ ప్రసాదం అందచేశారు. భక్తులకు యజ్ఞప్రసాదం అందజేసి వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఈ యజ్ఞంలో అనువంశిక ధర్మకర్త పి అశోక్ గజపతిరాజు దంపతులు, సుధా గజపతి, వెస్ట్ బెంగాల్ మినిస్టర్ బేచారం మన్న దంపతులు, ప్రముఖ రాజకీయ నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్ దంపతులు, చంద్ర శేఖర్ రెడ్డి, గంటా శ్రీనివాసరావు, రఘురామ కృష్ణంరాజు, పి. గనబాబు దంపతులు, విష్ణుకుమార్ రాజు, ఒడిస్సా భక్తుడు లక్ష్మీ కాంత్ దాసోనాయక్ దంపతులు పరివారం.

జీవవైవిధ్యాన్ని కాపాడాలి : అనసూయా దేవి

విశాలాంధ్ర - మల్కాపురం : ప్రకృతిలో ఉన్న ప్రతి జీవి ప్రముఖమైనదేనని, దాన్ని రక్షించడం మన బాధ్యత అని జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయా దేవి అన్నారు. స్థానిక మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం జీవవైవిధ్య దినోత్సవ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సృష్టిలో ఉత్పత్తి దారులు, వినియోగదారులు మరియు విచ్ఛిన్నకారులు అని మూడు రకాల జీవులు ఉన్నాయని, ఇవి ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయని అన్నారు. జీవ వైవిధ్యం దెబ్బ తినడం వల్ల వాతావరణంలో మార్పులు సంభవిస్తున్నాయని ఆమె అన్నారు. అనంతరం వివిధ రకాల కళాకృతులను తయారు చేయడంలో చిన్నారులు నిమగ్నమయ్యారు. బొకే లను తయారు చేశారు. ప్రముఖ రచయిత కె.సత్తిరాజు బారిష్టర్ పార్వతీశం నవలను చిన్నారులకు పరిచయం చేశారు. అంతకుముందు రాజా రామ్మోహన్ రాయ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి మరియు గ్రంథాలయాధికారి అజయ్ కుమార్ పూలమాలను వేసి ఘనంగా అంజలి ఘటించారు. కార్యక్రమంలో చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్లే స్కూల్స్‌పై చర్యలు తీసుకోండి : ఆర్జేడీకి అప్సా వినతి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : పాఠశాల విద్యా సంచాలకులు బి.విజయ్ భాస్కర్ గారికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రైవేట్ పాఠశాలల సంఘం (అప్సా) నాయకులు ప్లే స్కూల్స్ పై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్లే స్కూల్స్ ముసుగులో నర్సరీ, యల్.కె.జి, యు.కె.జి తరగతులతో పాటు 1,2,3 తరగతులు కూడా ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా నిరీహిస్తున్నారనీ, కనుక జిల్లాలో పుట్టగొడుగుల్లా ప్రతీ వీధి కొకటి వెలసిపోతున్న వందలాది ప్లే స్కూల్స్ పరిశీలించి, తగు చర్యలు తీసుకోవాలని సంఘ సభ్యులు ఆయన్ని కోరారు. ప్లే స్కూల్స్ అంటే కేవలం ప్రి ప్రైమరీ తరగతులు మాత్రమే నిర్వహించాలని, వాటి కి కూడా అనుమతులు మంజూరు చేయించాలని కోరారు. ఆర్జేడీ ని కలసిన వారిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సింహాచలం, ఫైనాన్స్ సెక్రటరీ పి. భాస్కర రావు, సీనియర్ సభ్యులు యమ్.జనార్ధన్, గణపతిరావు, సత్యం, రామ్మోహన్, సత్యన్నారాయణ తదితరులున్నారు.

ప్రభుత్వ స్థలంలో బోర్డు ఏర్పాటు

విశాలాంధ్ర కథనానికి స్పందన...

విశాలాంధ్ర - ఆనందపురం : అక్రమంగా ప్రభుత్వ కాలువను కప్పిస్తున్నారని విశాలాంధ్ర దినపత్రికలో వచ్చిన కథనానికి మండల తాసిల్దార్ హేమంత్ కుమార్ స్పందించి ప్రభుత్వ స్థలంలో రెవెన్యూ బోర్డు ను వీఆర్వోలు హేమ, అప్పారావు, అప్పలరాజు, వీఆర్ ఏ సమక్షంలో ఏర్పాటుచేశారు.ఈ సందర్భంగా ఎమ్మార్వో మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాన్ని ఎవరైనా ఆక్రమించినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హేమంత్ కుమార్ హెచ్చరించారు.